క్లుప్తంగా

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



సుభాష్‌ను అభినందిస్తున్న స్పీకర్

మోమిన్‌పేట: అంకితభావంతో పని చేసే వారికి కాంగ్రెస్ పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన సుభాష్ శుక్రవారం శాసనసభ ఆవరణలో మర్యాద పూర్వకంగా స్పీకర్‌ను కలిశారు. స్పీకర్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్, ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, నాయకులు సురేందర్, బాగ్దాద్, రవి, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటుకు వినతి



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న బీసీ నాయకులు

తాండూరు టౌన్: కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈడిగి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాజుల లింగం, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహనాయక్ తదితరులు ఉన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

తాండూరు టౌన్: పట్టణానికి చెందిన కవి ద్యావరి నరేందర్ రెడ్డి రచించిన శ్రీలక్ష్మీ నారసింహం తెలుగు భక్తి గజల్స్ పుస్తకాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని డోలాముఖి ఫిలిమ్ ప్రొడక్షన్ కార్యాలయంలో సినీ దర్శకుడు వేణు ఊడుగుల చేతుల మీదుగా బుక్‌ను విడుదల చేశారు. సినీ నిర్మాత నాగేశ్వరరావు పూజారి, ప్రముఖ గజల్ గాయకులు డాక్టర్ స్వరూపారెడ్డి, దివాకర్, జిల్లా లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు టి.మహేందర్, బీజేపీ నాయకులు పి.రాము తదితరులు కవి నరేందర్‌రెడ్డిని అభినందించారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



పాలేపల్లిలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

దోమ: మండల పరిధిలోని పాలేపల్లి పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి మాట్లాడారు. ప్రతి విద్యార్థి లక్ష్యాలను ఎంచుకొని పట్టుదలతో చదవాలన్నారు. ఉపాధ్యాయులు అనురాధ, నర్సింహులు, మల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



పోలీసుల అదుపులో బీఆర్‌ఎస్ నాయకులు

దౌల్తాబాద్: కొడంగల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకుగాను శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల సందర్భంగా మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర్‌రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు హాజరవుతున్న సందర్భంగా మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం సాయంత్రం విడిచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, ఆశప్ప, విష్ణు, మల్కప్ప, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



పరిగి: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అశోక్ తదితరులు



తాండూరు టౌన్: నివాళులర్పిస్తున్న ప్రజా, కుల సంఘాల నాయకులు



బొంరాస్‌పేట: తుంకిమెట్లలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



అనంతగిరి: నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం ఆయా మండలాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో రాజకీయ నాయకులు, అధికారులు, ప్రధానోపాధ్యాయులు చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. రాజ్యాంగనిర్మాత అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు.



దోమ: బొంపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంఈజీ వెంకట్ తదితరులు



బంట్వారం: సల్బత్తాపూర్‌లో నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



కొడంగల్ రూరల్: నివాళులర్పిస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు



అనంతగిరి: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తదితరులు



పూడూరులో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



తాండూరు రూరల్: చెన్‌గేస్‌పూర్‌లో నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



మర్పల్లిలో నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు



బొంరాస్‌పేట: కొత్తూరులో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్థానిక నాయకులు

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు రాజిరెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు

సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి

దోమ: బీఆర్‌ఎస్ నేతలను అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గు చేటని మాజీ సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం రాష్ట్ర మాజీ మంత్రి హరీశ్‌రావు, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అక్రమ అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి తరలి వెళ్తుండగా పోలీసులు ముందస్తుగా తన నివాసానికి వచ్చి అరెస్టు చేయడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేయిస్తున్న అక్రమ అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఆపలేరన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో బలమైన ఉద్యమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు.

బ్రాహ్మణ సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతి

కొడంగల్ రూరల్: వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి కొడంగల్‌కు విచ్చేసిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు శుక్రవారం బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు కరణం దత్తాత్రేయరావు, నియోజకవర్గ అధ్యక్షుడు టేకుల్ కోడ్ లక్ష్మణ్‌రావు, పట్టణ పురోహితులు కిట్టుస్వామి బ్రాహ్మణ సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందించారు. గతంలో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు రూ. 50కోట్ల నిధులను విడుదల చేయించారని, ప్రస్తుతం పూర్తిస్థాయి బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఏర్పాటుచేయాలని కోరారు. పేద బ్రాహ్మణులకు స్వయం ఉపాధి, విద్య కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదల చేయించాలని వినతి పత్రంలో కోరారు.



మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

బొర్ర నవీన్‌కు సన్మానం

దుద్యాల్: మండల పరిధిలోని కుదురుమల్ల గ్రామానికి చెందిన బొర్ర నవీన్ కొడంగల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ వైస్ చైర్మన్‌గా ఎన్నిక కావడంతో మాజీ సర్పంచ్ రఘుపతి, కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా బొర్ర నవీన్ మాట్లాడారు. తనను ఆదరించిన ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటానన్నారు. పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సిములు, ప్రకాశ్, జనార్దన్ గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, గ్రామ యువకులు, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.



నవీన్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

రైతుకు పరిహారం అందజేత



రైతు కుటుంబానికి చెక్కు అందిస్తున్న అటవీశాఖ అధికారులు

యాలాల: మండలంలోని రేళ్లగడ్డ తండాలో అక్టోబర్ 16న పులిదాడిలో చనిపోయిన లేగదూడ ఘటన విషయంలో బాధిత రైతుకు అటవీశాఖ అధికారులు శుక్రవారం పరిహారం అందజేశారు. ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శంకర్ గ్రామానికి వెళ్లి బాధిత రైతు సక్రిబాయి, గోప్యానాయక్ దంపతులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10వేల చెక్కును అందించారు. ఈ సంరర్భంగా సెక్షన్ అధికారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• నేడు కాళిమాత విగ్రహ ప్రతిష్ఠ

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం ఎర్రగోవింద్ తండాలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు కాళి మాత విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తారని కుల్కచర్ల మాజీ ఎంపీపీ సత్యమ్మహరిశ్చందర్ తెలిపారు. 7వ తేదీ అమ్మవారి, ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలు, 8వ తేదీ ధ్వజారోహణ, ఊరేగింపు ఉంటుందని ఆమె పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

• నైపుణ్యానికి వైకల్యంతో పనిలేదు

పరిగి: నైపుణ్యానికి దివ్యాంగత్వంతో పనిలేదని ప్రధానాచార్యులు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో అంధులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభక్తి, భక్తి పాటలతో ఎంతో మంది ప్రతిభ చూపిస్తున్నారన్నారు. దివ్యాంగత్వంతో బాధపడకుండా సమాజంలో తమదైన ముద్రవేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. కష్టపడి చదివితే సాధించనిదంటూ ఏది లేదన్నారు.

• సీఎం కప్ అప్లికేషన్స్ కావడం లేదు

దుద్యాల్: సీఎం కప్ కోసం క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవడానికి అప్లికేషన్ కంప్యూటర్‌లో తెరచుకోకపోవడంతో క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు మూడు రోజులుగా ఆన్‌లైన్ అప్లికేషన్‌కు సంబంధించిన సర్వర్లు బిజీ కావడంతో గ్రామీణ స్థాయి క్రీడాకారులు అప్లికేషన్ చేయలేకపోతున్నారని వారు చెబుతున్నారు. శుక్రవారం చివరి తేదీ కావడంతో గ్రామాల్లోని ఆన్‌లైన్ కేంద్రాల్లో క్రీడా ప్రతిభ కల్గిన వారు అప్లికేషన్ కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి వరకు కూడా సర్వర్లు పనిచేయకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. సర్వర్లు పని చేయని కారణంగా అప్లికేషన్ చేసుకోలేకపోయామని, ప్రభుత్వం ఈ గడువును పెంచాలని క్రీడాకారులు కోరుతున్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

షాబాద్: దాతల సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని కమిటీ సభ్యులు పొన్న సుధాకర్ రెడ్డి, దోనూరి గోపాల్ అన్నారు. సాయిరెడ్డిగూడ శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ పునఃనిర్మాణానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి రూ.50వేలు, రియల్‌ఎస్టేట్ వ్యాపారి దండు రాహుల్ గుప్తా రూ.21వేల ఆర్థికసాయం ప్రకటించి ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సులోచన శేఖర్‌రెడ్డి, యాదయ్య, ఆలయ కమిటీ నిర్వాహకులు విఠలయ్య, శంకరయ్య, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ లోడ్‌కు చెక్

- నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు
- గోకఫసల్‌వాద్‌లో నూతన సబ్ స్టేషన్
- ప్రారంభమైన పనులు

దౌల్తాబాద్: వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్‌ను అందించేందుకు ఆశాఖ అధికారులు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నారు. మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఐదు గ్రామాలు ఉండడంతో ఓవర్‌లోడ్‌తో ఏవైనా ఇబ్బందులు ఎదురైనప్పుడు పనుల్లో జాప్యం జరిగేది. ఈ సమస్యను అధిగమించేందుకు మండలంలోని గోకఫసల్‌వాద్ గ్రామంలో నూతన సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించడంతో వెంటనే మంజూరు చేయించారు.

గోకఫసల్‌వాద్‌లో ఏర్పాటు

మండలంలో 33 గ్రామపంచాయతీలు ఉన్నాయి. మండల పరిధిలో బాలంపేట, దౌల్తాబాద్, సురాయిపల్లి, నర్సాపూర్ గ్రామాల్లో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. అయితే దౌల్తాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలోని గోకఫసల్వాద్ ఫీడర్ కింద సుమారు ఐదు గ్రామాలు, 5తండాలు ఉన్నాయి. వీటి పరిధిలో అధికంగా వ్యవసాయ, గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. యాసంగిలో పంట పొలాలకు నీరు ఎక్కువగా అవసరమవుతుంది. ఈ సమయంలో విద్యుత్ సమస్యలు రావడంతో అధికారులు, రైతులు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను అధిగమించాలంటే కొత్త సబ్ స్టేషన ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కొత్త సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే దౌల్తాబాద్ సబ్ స్టేషన్‌పై భారం తగ్గుతుందని పేర్కొంటున్నారు. మరో నాలుగైదు నెలల్లో ఇందుకు సంబంధించిన పనులు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు.



గోకఫసల్‌వాద్ వద్ద కొనసాగుతున్న సబ్ స్టేషన్ నిర్మాణ పనులు

పనులు ప్రారంభమయ్యాయి

గోకఫసల్‌వాద్ ఫీడర్ లాంగ్ లైన్ ఉంది. దీంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ప్రస్తుతం గోకఫసల్‌వాద్ గ్రామం దగ్గర సబ్ స్టేషన్ మంజూరు కాగా పనులు ప్రారంభమయ్యాయి. సాధ్యమైనంత త్వరగా వీటిని పూర్తి చేస్తాం. ఈ ఫీడర్ కింద ఉన్న గ్రామాలకు ఇప్పటికే విద్యుత్ అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. – మహిపాల్, ఏఈ, దౌల్తాబాద్